నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | శుక్రవారం 21 జూన్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని లాక్కెళ్తున్న పోలీసులు

జేఏవో బడ్జెట్ చదువుతుండగా అడ్డుకుంటున్న బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లు

రచ్చ రచ్చ

బల్దియా బడ్జెట్ సమావేశం రసాభాస

గందరగోళం మధ్యే బడ్జెట్ ఆమోదం

- నినాదాలు, నిరసనలతో అట్టుడికిన కౌన్సిల్ హాల్
- కళాతోరణం తొలగించొద్దని తీర్మానం చేయాలని బీఆర్ఎస్, బీజేపీ సభ్యుల పట్టు
- మేయర్ తిరస్కరించడంతో పోడియం వద్దకు దూసుకెళ్లిన మహిళా కార్పొరేటర్లు
- బడ్జెట్ ప్రతుల చించివేత
- ఎమ్మెల్సీ పోచంపల్లి ఆధ్వర్యంలో సభ్యుల బైఠాయింపు, ధర్నా
- అడ్డుకున్న పోలీసులు.. ప్రతిఘటించిన కార్పొరేటర్లు
- బల్దియా వద్ద భారీగా పోలీసుల మోహరింపు

వరంగల్, జూన్ 20 : బల్దియా బడ్జెట్ సమావేశం రచ్చ రచ్చగా సాగింది. కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో గురువారం మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన జరిగిన బడ్జెట్ సమావేశం రసాభాసగా మారింది. బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్ల నిరసనలు, నినాదాల మధ్య 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ. 650.12 కోట్ల అంచనాలతో ప్రతిపాదించిన బడ్జెట్‌ను కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల మద్దతుతో ఆమోదించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసుల నిర్బంధం మధ్య బడ్జెట్ సమావేశం నిర్వహించారు. పోలీసుల తనిఖీ తర్వాతే కార్పొరేటర్లను కౌన్సిల్ హాల్‌లోకి అనుమతించారు. ఉదయం 11.30 గంటలకు సమావేశం ప్రారంభం కాగానే బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. ఒక వైపు బీఆర్ఎస్, మరో వైపు కాంగ్రెస్ సభ్యుల నినాదాలతో సభలో ఏం జరుగుతుందో అర్థంకాని పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ కార్పొరేటర్లు నల్లబ్యాడ్జీలు ధరించి బడ్జెట్ సమావేశానికి హాజరై నిరసన తెలిపారు.

కళాతోరణంపై తీర్మానానికి పట్టు..

రాష్ట్ర ప్రభుత్వ రాజముద్ర నుంచి కాకతీయ కళాతోరణం తొలగించొద్దని తీర్మానం చేయాలని బీఆర్ఎస్ కార్పొరేటర్లు పట్టుబట్టారు. వీరికి మద్దతుగా బీజేపీ కార్పొరేటర్లు నిలిచారు. డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ తీర్మాన పత్రాన్ని అందజేశారు. దీన్ని మేయర్ తోసిపుచ్చి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. కాకతీయుల సామ్రాజ్యానికి రాజధాని అయిన వరంగల్ నుంచి తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించాలని బీఆర్ఎస్ కార్పొరేటర్లు నినాదాలు చేశారు.

పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

బడ్జెట్ ప్రతులను చించివేసిన మహిళా కార్పొరేటర్లు..

బల్దియా బడ్జెట్ సమావేశం గందరగోళంగా సాగింది. బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లు పోడియం వద్దకు దూసుకుపోయి మేయర్ గుండు సుధారాణితో వాగ్వాదానికి దిగారు. నిరసనలు, నినాదాల మధ్యే జేఏవో సరిత బడ్జెట్‌ను చదువుతుండడంతో బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె చేతుల నుంచి బడ్జెట్ ప్రతులను లాక్కొని చించివేశారు.

బడ్జెట్ కాపీలను చింపేస్తున్న బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్ స్వరూపారాణి

జై తెలంగాణ నినాదాలతో మార్మోగిన సభ..

బల్దియా బడ్జెట్ సమావేశం జై తెలంగాణ నినాదాలతో మార్మోగింది. కాకతీయ కళాతోరణంపై బీఆర్ఎస్ తీర్మానాన్ని మేయర్ తోసిపుచ్చడంతో బీఆర్ఎస్ సభ్యులు సమావేశాన్ని అడ్డుకున్నారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు తమ సీట్లలో నిల్చొని జై తెలంగాణ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వీరికి ప్రతిగా కాంగ్రెస్ కార్పొరేటర్లు జై కాంగ్రెస్ నినాదాలు చేశారు.

పోలీసుల దిగ్బంధంలో బల్దియా..

బల్దియా ప్రధాన కార్యాలయాన్ని పోలీసులు దిగ్బంధించారు. ఉదయం 10 గంటల నుంచే పోలీసులు కౌన్సిల్ హాల్ వైపు ఎవరూ రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. కార్పొరేటర్లను సైతం తనిఖీల పేరిట ఇబ్బందులు పెట్టారు. కార్పొరేషన్ చరిత్రలో పోలీసుల పహరా మధ్య బడ్జెట్ సమావేశం జరగడం ఇదే తొలిసారి అని చెప్పుకుంటున్నారు. ఏసీపీ, సీఐ, ఎస్సై స్థాయి అధికారులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బీఆర్ఎస్ కార్పొరేటర్ల బైఠాయింపు, ధర్నా

బడ్జెట్ సమావేశం ముగిసిన అనంతరం బల్దియా ప్రధాన గేట్ ఎదుట బీఆర్ఎస్ కార్పొరేటర్లు ధర్నాకు దిగారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు బైఠాయించారు. పోలీసులు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లకు మధ్య తోపులాటతో ఉద్రిక్తత నెలకొంది. ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, కార్పొరేటర్లను పోలీసులు లాగిపడేశారు. దీంతో మేయర్ గుండు సుధారాణి, పోలీసుల నిర్బంధానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ సభలో బడ్జెట్‌ను చదవకుండానే ఆమోదం తెలిపారని విమర్శించారు. పోలీసుల నిర్బంధాల మధ్య బడ్జెట్ సమావేశం నిర్వహించడంపై మండిపడ్డారు.

చదవకుండానే బడ్జెట్‌కు ఆమోదం..

బడ్జెట్‌ను చదవకుండానే ఏకపక్షంగా ఆమోదించారు. సభ్యులకు కనీస గౌరవం ఇవ్వకుండా కక్ష సాధింపుతో వ్యవహరించారు. పోలీసుల నిర్బంధం మధ్య బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. రాజముద్రలో కాకతీయ కళాతోరణాన్ని తొలగించొద్దని తీర్మానం చేయాలంటే మేయర్ పట్టించుకోలేదు. వరంగల్ ప్రజల ఆత్మగౌరవాన్ని హరిస్తే ఊరుకునేది లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెప్పుకోసం కాకతీయ కళాతోరణంపై తీర్మానం చేయలేదు. మేయర్ వ్యవహారశైలి సరికాదు. ఎమ్మెల్సీ అనే గౌరవం ఇవ్వకుండా పోలీసులు వ్యవహరించారు. లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ప్రజాస్వామ్య పద్ధతితో నిరసన తెలిపితే పోలీసులు అడ్డుకోవడం విచారకరం.

– పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ

పోలీసుల నిర్బంధం ఎప్పుడూ చూడలేదు..

బల్దియాతో నాకు 42 ఏళ్ల అనుబంధం ఉంది. ఇప్పటి వరకు బల్దియా కార్యాలయంలో పోలీసుల నిర్బంధం ఏనాడు చూడలేదు. ఇది మంచి పరిణామం కాదు. బడ్జెట్‌లో కొత్తగా ఏమీ లేదు. నిరుపయోగమైన బడ్జెట్ ఇది. రాజముద్ర నుంచి కాకతీయ కళాతోరణం తొలగించొద్దని కౌన్సిల్‌లో తీర్మానం చేస్తే బాగుండేది. ఇది వరంగల్ ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశం. పోలీసుల చర్యలను ఖండిస్తున్నాను.

– బస్వరాజు సారయ్య, ఎమ్మెల్సీ

మేయర్ పోడియం వద్దకు వచ్చి పోటా పోటీ నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు

నల్ల బ్యాడ్జీలతో బడ్జెట్ సమావేశానికి వచ్చిన బీజేపీ కార్పొరేటర్లు

పోలీసులతో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య వాగ్వాదం

తెలంగాణే ఆయన ధ్యాస.. శ్వాస..

నేడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి

- జయశంకర్ మెమోరియల్ ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏకశిల పార్కులో ఏర్పాట్లు
- పాల్గొననున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

'మా వనరులు మాకున్నాయి.. మా వనరులపై మాకు అధికారం కావాలి. యాచక దశ నుంచి శాసించే దశకు తెలంగాణ రావాలె! మా తెలంగాణ మాగ్గావాలె!!' అంటూ తెలంగాణే ధ్యాస, శ్వాసగా తన జీవితాన్ని తెలంగాణ ఉద్యమానికే అంకితం చేశారు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్. విద్యార్థి దశ నుంచే తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలు, అసమానతలపై తీవ్రంగా పోరాటం చేయడంతో పాటు నాన్ ముల్కీ, 1969 తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద విశ్వవిద్యాలయాలు, ఇతర సమావేశాల్లో తెలంగాణ రణన్నినాదాన్ని వినిపించారు. 'అబ్‌తో ఏక్ హీ ఖ్వాహిష్ హై, వో తెలంగాణ దేఖ్‌నా.. ఔర్ మర్‌జానా' అని తరచూ చెప్పే ఆయన చివరకు తెలంగాణ ఏర్పాటును కళ్లారా చూడకుండానే జూన్ 21, 2011లో కన్నుమూశారు.

హనుమకొండ, జూన్ 21 : తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమస్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 13వ వర్ధంతిని జయశంకర్ మెమోరియల్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ ఉద్యాన వనం(ఏకశిల పార్కు)లో వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఆరు దశాబ్దాలపాటు తెలంగాణ ఆవశ్యకతను ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత ఉద్యమ శిఖరం, ప్రత్యేక రాష్ట్రం కావాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తన గొంతుకను వినిపించిన జయశంకర్ సార్‌ను స్మరించుకోనున్నారు. కుటుంబ సభ్యులతో పాటు ట్రస్టు సభ్యులు, పలువురు ప్రజా ప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొని జయశంకర్‌సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు.